ఆదర్శ ప్రపంచము

శ్రీమతి వెలిదండ చూడికుడుత్తమ్మగారు

(గతసంచిక తరువాయి)

కలెక్టరు డేవిడ్డు మొత్తంమీద మంచిహృదయం గలవాడు. సర్వమానవ సౌభ్రాతృత్వమును, పుస్తకాలయందు చదవడమే కాకుండా, ఆచరణలో పెట్టాలనేటటువంటి ఉద్దేశంగలవాడు. జీసను, దీనులకోసరం చూపించేజాలిని, త్యాగమును తరుచూ మననముచేసే స్వభావం గలవాడు. ఈదేశంలో వెయ్యింటికి 999 మంది గర్భదరిద్రులుగా ఉన్నారని తనకు సాధ్యమైనంతమట్టుకు ఆ దరిద్రులకు ఉపకారంచేసి ఈదేశపు ఉప్పు తిన్నందుకు ఈ దేశజులఋణం తీర్చుకుని వారి కృతజ్ఞతను, పొందవలెననెడి ఉదారాశయం గలవాడు. ఆదివారం ప్రత్యేకంగా తన దర్బారు రూములో తహస్సీలుదారు రామచంద్రరావుతో అక్రిందటిరోజునే వచ్చిన ప్రేమానందరావు పిటీషను కాగితాన్ని చూస్తూ

"ఏమండీ రామచంద్రరావుగారూ! ఈ ప్రేమానందరావెవరో మీకు తెలుసునా?"

ఇంతలో ఒక జవానువచ్చి చేతిలో ఒక కాగితము పెట్టి నిలబడ్డాడు. కలెక్టరు తనలో నవ్వుకుంటూ "అయ్యా! మీరు స్వయంగావెళ్లి అతన్ని తీసుకురండి". తహస్సీలుదారు వెంటనేవెళ్లి ఇద్దరు కొత్త మనుష్యులతో లోపలికి తిరిగివచ్చాడు. పరస్పరము అభివందనాలయిన తరువాత కలెక్టరుగారు "మీ పిటీషన్ చూశానండి. మీరు పేదవాళ్ళకు అవసరమైన సహాయముచేస్తూ ఉన్నందుకు నాకు చాలసంతోషము. నాకుతోచిన సహాయం నేను చేయడానికి సిద్ధంగానే వున్నాను. కాని మీరు ఆసంస్థతరఫున కొన్నటువంటి గ్రామవిషయంలో పన్నులు తగ్గించటంమాత్రము నాకు సాధ్యమని ఇప్పట్లో తోచదు."

"తమరు అలాగు సెలవిస్తే ప్రజలు ఇక చేసేదేమిటి? ఇటువంటిపనులు ప్రభుత్వమువారే స్వయంగా చేసి ప్రజల్లో శాంతిసౌఖ్యాలను నెలకొల్పిన ప్రజాప్రభుత్వముల మధ్యఉన్న అంతరములన్నీపోయి, నిజమైన సౌఖ్యము, నిజమైనకీర్తి తప్పకుండా ఉభయులకు కలిగేది."

"ఈమధ్యనే ప్రభుత్వమువారు గ్రామస్థుల సహాయంకోసరం కొంతసొమ్మును శాంక్షన్ చేసారు. దానిలో కొంత ఈసంస్థకు వీలుపడితే ఇయ్యడానికి ప్రయత్నంచేస్తాను."

"అయితే భూమిపన్ను విషయంలోకూడా న్యాయంగా ప్రభుత్వమువారు విధించవలసిన పన్ను కాకుండా అందులో సగమే పేదలసహాయం కోసరం ఏర్పడ్డ ఈగ్రామమునకు విధించవలసిందని నామనవి."

"ఈకరువుకాలంలో ప్రభుత్వమువారు దీనికి ఒప్పుకుంటారని తోచదు. అయినా నాశక్తి లోపం లేకుండా ప్రయత్నంచేస్తాను."

"తమరిదయ. భగవత్సంకల్పము. నాప్రయత్నం నే చేస్తానుగాని ప్రభువైన మీవంటివారి సహాయసంపత్తులులేనిదే ఏపనీ మేము ప్రజలమైన పూర్తిగా చేయలేము. ఒకవేళ చేయదలచినా పునాదిలేనిగోడలాగ శాశ్వతంగా ఎప్పటికీ ఉండదని నానమ్మకము. ఈ కాగితం కొంచం చిత్తగించండి."

"కాగితముమీద అక్కర్లేదు. మీరు పేదలకోసరం కలెక్షను చేసే ఫండుకు ఈచెక్కును తీసికొని ఉపయోగించండి. నాకు తోచింది అప్పుడప్పుడూ ఇలాగే చేస్తూఉంటాను."

"చిత్తం. చాలాసంతోషం. మీరీమాత్రం అవకాశం మాకిచ్చినందుకు మా మనస్ఫూర్తివందనాలు. ఇక సెలవు. మీ విలువైనకాలాన్ని అనవసరంగా వృథా పుచ్చను" అని అంటూ అవతలికి వెళ్లి—

"వినయా! ఇతడు స్వభావముగా మంచి ఉన్నతోద్దేశములుగల వాడైనట్లేతోచుచున్నది. ఒక్కసారి వెయ్యిరూపాయల చెక్కు ఇవ్వడమే కాకుండా ఇంకా తనకుతోచిన సహాయము చేస్తాననికూడా అన్నాడు. మన అశోకనిలయం ప్రవేశోత్సవానికి ఈయననే అధ్యక్షునిగా ఉంచవలెనని నాఉద్దేశము. ఇట్టి అంతఃకరణశుద్ధి, ఇట్టి నిగర్వత మనము సాధారణంగా ఎవరిలోకూడా చూడలేము."

"ఇప్పటికి మనఫండుకు కింతవరకు వసూలైనది మనం పేపర్లలోకి తెలుపవలసియున్నదని నిన్న నేకదా అన్నావు. రేపు అన్నీచూచుకొని పంపుదాము." ఈలాగు స్నేహితులిద్దరూ మాటాడుకుంటూ తాము కట్టిస్తూఉన్న అశోకనిలయంలోకి ప్రవేశించారు. అప్పటికప్పుడే పేదజనం అందరూ స్నానపానాలు పూర్తిచేసుకొని రామమోహనరావు చెప్పిపోయిన విషయాలను చెప్పుకుంటూ అప్పుడేవస్తూ ఉన్న చిరువెన్నెట్లో కూర్చున్నారు. పదిపన్నెండేండ్ల పిల్లలు వేరే ఇంకొకచోట తాము నేర్చుకున్న నీతిపద్యాలను చదువుతూ గంతువేస్తున్నారు. ప్రేమానందరావు తనకోసరం ఎదురుచూస్తూఉన్న లేడీడాక్టరును చూచి

"ఏమిలాగు వొచ్చారు. మీరు చాలా అభిమానంగా కన్నబిడ్డల్లాగ ఈ నిరుపేదలను తగినట్లుగా చూస్తున్నందుకు చాలా సంతోషం. మీరు, ఆసర్జనుగారు, ఆ ఆయుర్వేదఆచార్యులుగారు పరస్పరము సలహాలను చేసుకుంటూ ఆంగ్ల, ఆయుర్వేదవైద్య రహస్యాలను గూర్చి పత్రికాముఖంగా విమర్శనాపూర్వకంగా తరుచూ ప్రజలకు తెలుపుచుండాలనికూడా నా కోరిక."

"మీరు ప్రతిఫలంలేకుండా మానవసేవే జీవిత పరమావధిగా పెట్టుకొని ఇంతకష్టపడి జీవితం ధార పోస్తూఉంటే జీతాలు పుచ్చుకుంటూ మీరిచ్చిన బసల్లోనేఉంటూ మీరు చెప్పినపని చేయడంలో అతిశయమేముంది. వారి కారోగ్యనియమాలను గురించి ఇంకా తగినట్లుగా బోధపడలేదు."

"పాపము వారికప్పుడే ఏలాగు బోధపడతాయి. మేము మానవులమే అని తెలుసుకు నేటట్లుగా ముందు, వారికితగిన మానసికోద్బోధన చేస్తే వాటంతటవే అన్నీసులభంగా వాళ్ళకు బోధపడతాయి. ఇంతవరకూ మీరుచేస్తూఉన్న పనికి చాలా సంతోషము. ఆ పేదల కందరికీగూడ సంతాననిరోధవిషయం చక్కగా బోధ పరుస్తూ దాని ఆవశ్యకతవారికి నచ్చచెప్పాలి."

"ఆలాగే నాకు సాధ్యమైనంతవరకు మీరు చేస్తూ ఉన్న ఈపనికి సహాయం పూర్తిగా చేయాలని నా త్రికరణశుద్ధియైన కోరిక ఇక నే సెలవుతీసుకుంటా."

"ఎవరండీ బాబూ! ఇక్కడ ప్రేమానందరావనే అబ్బాయి ఎక్కడున్నాడు?"

"నేనేనండి. ఇలా దయచేయండి. ఏం సెలవు."

"నాయనా! మీతండ్రినాట్నించి నాకు మీ కుటుంబం బాగాతెలుసు. నీతండ్రిపోయినా ఇంత చిన్నవయస్సులోనే ఇంతచదువు చదువుకొని ప్రపంచం అంతాతిరిగి జ్ఞానాన్ని సంపాదించావు. దానికి తగినట్లుగా స్వార్థాన్నిపూర్తిగా చంపేసుకొని నీ స్వంతఆస్తినంతా వెచ్చించి ఈ సంవత్సరపున ఒక గ్రామాన్ని కొనేశావు. నిర్ధనంకోసం, పడరాని పాట్లుపడుతూ పెద్దలందరినీచూచి వారిచేత 'ఓహో' అనిపించుకుంటూ డబ్బును పోగుచేస్తున్నావు. దీనుల్ని ఉద్ధరించడానికి కంకణంకట్టుకున్నావు. కిరీటంగల రాజుకున్నంతబాధ్యతను కిరీటంలేకుండా నీవు వహించి కీర్తిపొందుతున్నావు. పంచాయతీసభలను ఏర్పాటుచేసి, గ్రామస్థులు బయటికి పోనక్కర్లేకుండా చేసావు. పాఠశాలను, బోధకులను ఏర్పాటుచేసి

ఇంకా గవర్నమెంటుకు వ్రాసి ఇంకా సహాయం పొందుటకు ప్రయత్నం చేస్తున్నావు."

"ఏమిటండీ తాతగారూ ! ఈ పురాణమంతాను. భగవంతుని ఇచ్ఛాధీనులమైన మనం, మనం చేసేదేమిటి? ఇంతకూ పర్యవసాన మేమిటో తేల్చారు కాదు."

"అందుకే నేనింతదూరం వచ్చాను. ఇంతదూరం చెప్పాను. నువ్వు ఇప్పుడు చేస్తూఉన్న పని, జరుపుతూ ఉన్న మార్గం చాలా బాగుంది. గాని నువ్వేర్పరిచిన సంతాననిరోధం (బర్తుకంట్రోలు) పద్ధతిమాత్రం ఏమీ బాగులేదు. ఇప్పటికే ప్రపంచంలో అరాచకం జాస్తి అయిపోతున్నది. ఆదర్శాలు మారిపోయినాయి. స్వాతంత్ర్యానికిబదులు స్వేచ్ఛాచారం పెరిగిపోతున్నది. ఇక ఇదికూడా అమల్లోకి వచ్చిందంటే ప్రపంచంలో నీతి సౌశీల్యము అన్నది పూర్తిగా నశించి పోతుంది."

"దీనికనేనా అంత గాబరాపడుతున్నారు. ఈ పద్ధతివల్ల ప్రత్యేకంగా అవినీతికెక్కడ అవకాశం ఉండదని నా ఉద్దేశం. అది ఏలాగంటే బ్రహ్మచర్యం అవలంబిస్తూ జీవితాన్ని పరోపకారంకోసం వినియోగించుకోడానికి ఉద్దేశించుకున్న వాళ్లకి ఈ పద్ధతులతో సంబంధమే అవసరంలేదు. ఎటొచ్చీ వివాహం చేసుకొని సంసారయాత్ర జరుపుకుంటూ, సంసారభారం వల్లగాని, దేహారోగ్యలోపంవల్లగాని అవస్థలు పడే వాళ్లకు ఇది అవసరం అంటారా, కాదంటారా ?"

"అవును గాని ఆ బాధ ఉన్న వాళ్లు దూరదూరంగా ఉండి కాలంగడుపుకోవాలి."

"తాతగారూ ! మీకూ 60 ఏళ్లు దాటాయి. ప్రపంచంలో కష్టాలు సుఖాలు పడుతూ చాలా అనుభవం సంపాదించారు. సంసారంలో ఉంటూ, పరస్పర అన్యోన్యతకు ధర్మంగా అలవాటుపడి అన్ని హక్కులూ కలిగి ఉన్న భార్య దగ్గిర ఉండగా, ప్రాపంచిక వాసనలలో, ప్రాపంచిక రుచులతో ఎల్లప్పుడూ ఉంటూ ఉన్న వాళ్లకు మడికట్టుకొని ఎల్లప్పుడూ ఉండటం సంభవమా ? పట్టుదలగా కొన్నాళ్లు సంభవమైనా ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు తప్ప అందరూ వ్యామోహములో పడక మానరు. బాగా యోచించండి. దీనివలన ఇంకొక మేలుకూడా ఉంటుంది. ధనహీనులందరూ సంసారభారానికి భయపడి అవివాహితులు గానే ఉండి ఆత్మోన్నతిలేనందున అక్రమమైన అలవాటుకు లోబడిపోయి ఆత్మవంచకులై దేహారోగ్యమును చెడగొట్టుకుంటూ జీవచ్ఛవాకారంగా తయారవుతున్నారు. దీనివలన అటువంటి దానికి అవసరంలేదుగదా?"

"అయితే మానవసృష్టి అంతా నశించవలసిందనేనా నీ ఉద్దేశము. భగవంతుని ఇచ్ఛకు అడ్డుతగిలి, మనం ఎంతమాత్రం శ్రేయస్సును పొందలేమని నా తాత్పర్యము."

"తాతగారూ ! ఒక్క సంగతి అడుగుతా చెప్పండి. వారికే ఒకపూట గుక్కెడు గంజికి, జానెడు గుడ్డకు గతిలేక అల్లాడుతూ ఉంటే వారిబిడ్డలు ఏవిధంగా ఈ ప్రపంచంలో జీవిస్తారో, వారివల్ల ఆ తల్లిదండ్రుల హృదయాలు ఎంత క్షోభపడిపోయి అటమటించుతాయో కొంచం యోచించండి. దేహవికాసం, మనోవికాసం కూడాలేని ఆ బిడ్డలే దేశముయొక్క భవిష్యత్పౌరులుగా ఉండవలసిన వారుగదా. అదిగాకుండా ఎవరైనా నెత్తిమీద గంపెడు బరువుండి అవస్థపడడానికి ప్రయత్నిస్తామా, లేకపోతే మీనమేషాలని లెక్కపెడుతూ ఆ మనిషిని ఆ అవస్థకు వదలిపెట్టామా? కాబట్టి ఇప్పటి పరిస్థితులనుబట్టి తప్పకుండా ఉండి తీరవలసిందే. దీనివలన నిజముగా మానవసృష్టి నాశనమైపోయే కాలంవస్తే, అప్పటికి మనకంటే బుద్ధిమంతులు, మహానుభావులు ఉండకపోరు. కాలమే ఆవసరాన్నిబట్టి మనుష్యులకు నూతన ఉద్దేశాలను పుట్టించుననే ప్రకృతిసూత్రాన్ని మనం మరువకూడదు.

సర్వవ్యాపియైన భగవంతుడు ఏవిషయమైనా ప్రపంచానికి నూతనంగా వెలిబుచ్చ సంకల్పించినప్పుడు, దానిని ఏవ్యక్తిద్వారానైన వెలిబుచ్చునుగాని రూపము లేని ఈశ్వరుడు స్వయంగా మనకువచ్చిచెప్పుట అసంభవమనికూడా మనం మరువకూడదు."

"బాగానేఉంది. భగవంతుడు కర్మానుగతులనుగా జీవులను సృష్టించి ప్రపంచక్రమమును జరుపుతూఉంటే దాని కిది వ్యతిరేకంగదా."

"నేనొక్కప్రశ్నను మిమ్మల్ని అడుగుతా. మీ కోడలికి సంతానభాగ్యం లేకపోతే మొన్నమొన్ననే వైద్యంఅనీ, ఆసుపత్రిఅనీ, ఆపరేషన్లనీ ఎందుకు తాపత్రయపడ్డారు. కర్మ ఏలాగుంటే ఆలాగుంటుందని వదలిపెట్టక ఏరోగంవచ్చినా ఏరొచ్చువచ్చినా మానవప్రయత్నం అన్నది చేస్తున్నామాలేదా? మనం అన్నిప్రయత్నాలు చేసాక అది ఫలించకపోతే ఈశ్వర సంకల్పం వ్యతిరేకంగా ఉందనికదా మనం వదలిపెట్టాం. లేకపోతే మానవప్రయత్నానికి ఎక్కడైనా అవకాశం ఉంటుందా పూర్తిగా ఈకర్మసిద్ధాంతాన్ని పట్టుకుంటే?"

"అయితే ఎవరికి తోచిన వారు దీనిని అనుసరింపవచ్చు నన్నమాట?"

"ఇదిగో ఇందులోనేఉంది పొరబాటంతా. ఇప్పటి మోస్తరుగా బజారులో కూరగాయలవలె అయిన వాళ్లకీ, కానివాళ్లకీ ఈపద్ధతు లందుబాటులో ఉండకూడదు. పౌరుల బాగోగులకు బాధ్యులైన జిల్లాఅధికారుల స్వాధీనంలోఉండాలి—ఎవరికీసమస్య అవసరమో, ఎవరికి అనవసరమో అని నిర్ణయం చేసే అధికారం. అవసరమని కోరినవారిని మాత్రం, వారు నిజంగా భార్యాభర్తలో కారో, వారు దారిద్ర్యము చేతగాని, ఆరోగ్యలోపంచేతగాని నిజంగా బాధపడుతున్నారో లేదో బాగా పరీక్షచేసి చక్కని సాక్ష్యం తీసికొని మరీ దీనికి అనుజ్ఞఇవ్వాలి. ఇట్టి కేసులకు ప్రత్యేకంగా ఆసుపత్రులలో స్థానంఉండాలి. జనులకందరికీ ఇట్టి ఉపాయం ఉన్నదనిమాత్రం తెలిసేటట్టు చూడాలి. ఏది ఏలాగైనా దీని అధికారంమాత్రం అధికారుల చేతులలో పూర్తిగాఉండాలి. ఇలాగైతే సంఘంలో అవినీతిప్రవర్తనకు దోహదంగా ఈసంతాననిరోధము ఏమీ కారణముగదని స్పష్టముగా బుజువౌతుంది. తాతగారూ! కోపమా నామాటలకి."

"నాయనా! నీవుచెప్పిన సంగతులనుబట్టి కొంతవరకు ఇది అవసరమనే తోస్తుంది. ఇది అటుంచి నాసలహా ఒకటి యోచించు. నీవు ఎసెంబ్లిమెంబరువు గదా. నీవు పేదలకొరకు, నిరుద్యోగులకొరకూ ఎన్ని శ్రమలుపడినా తాత్కాలికపు ఉపశాంతేగాని శాశ్వత సహాయముగాఉండటం అసంభవం. మొట్టమొదట రైతుస్థితి బాగుపడీ వ్యవసాయంతో ప్రతివాళ్లు జీవించవచ్చుననే ఆశ అందరికి కలిగించాలి. దీనితో అందరికీ ఈఉద్యోగకాంక్ష చాలావరకు తగ్గి గ్రామ జీవితంవైపు దృష్టి మళ్లుతుంది. నీ శక్తిసామర్థ్యం, అన్నికేంద్రీకరించి ఈసంస్కారం జరపటానికి ప్రజల్లో, ప్రభుత్వములో కదలిక కలిగించితే నీవు నిజంగా సఫలీకృతుడవు అవుతావు. నేను పెద్దవాడ్ని. నా అనుభవంమీద నేను చెప్పాను."

"ఈసంగతి అందరూ అంటూఉన్నదే. నాఉద్దేశముకూడా అలాగేఉంది. భగవదుద్దేశం ఏలాగుందో?"